# ప్రేమపక్షులు

గుర్నాధాన్నీ అతని పెళ్ళాన్నీ చూస్తే 'ఎంత అన్యోన్యమైన జంట' అనే వారు పడుచువారు! 'చిలకా గోరెంకల్లా వున్నారు' అనేవారు పెద్దవాళ్ళు! కుర్రాళ్ళు మాత్రం వీళ్ళని చూసినప్పుడల్లా 'లవ్ బర్డ్స్' అని అరిచేవాళ్ళు.

గుర్నాధం ఆఫీసు కెళుతూన్నప్పుడు తప్ప ఆడ లవ్ బర్డ్ ఎప్పుడూ అతని వెంటే ఉండేది. ఆఫీసు నుండి రాగానే, కూరలు కొనాలన్నా ఇద్దరూ వెళ్ళేవారు. ఏదైనా షాపింగ్ చెయ్యాలంటే ఇద్దరూ వెళ్ళేవారు. ఎవరింటికైనా వెళ్ళాలన్నా ఇద్దరూ కలిసే వెళ్ళేవారు! సినిమాలకి కూడా వాళ్ళిద్దరే తప్ప ఇంకెవ్వరితోనూ వెళ్ళేవారు కాదు. ఎప్పుడు చూసినా, ఎక్కడ చూసినా వాళ్ళిద్దరే వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటూ వుండేవారు, చుట్టూ వున్న మనుషుల్ని కూడా లెక్క చెయ్యకుండా!

తరచు వీళ్ళిద్దర్నీ కలిసి చూసిన వాళ్ళకి 'ఈ ప్రపంచంలో వీళ్ళకి ఎవరూ స్నేహితులు లేరేమో' అనిపించేది. 'ఎంత అన్యోన్యమైన దాంపత్యం, క్షణం విడిచివుండరు' అనుకునేవారు.

కానీ గుర్నాధానికీ ఉన్నారు స్నేహితులు, ఇద్దరే ఇద్దరు! ఒకడు కాళేశ్వర్రావ్ చిన్నప్పటి స్కూలు ఫ్రెండు! ఇంకొకడు రాందాసు! దూరపు బంధువు! వరుసకి బావ అవుతాడు! చివరికి వాళ్ళొచ్చినా సగంసేపు గుర్నాధం భార్యామణితోనే మాట్లాడ్డం, వాళ్ళు కూడా అనుకునేవాళ్ళు, వీళ్ళిద్దరూ విడిపోని జంట! కన్నులపంట!' అని.

అందరూ కలిసి కాఫీ హోటల్ కెళితే, గుర్నాధం ఏం తింటే, భార్యామణి కూడా అదే తినేది! ఔరా! ఎంత విచిత్రం! వీళ్ళు తినడంలో కూడా ఆమెకి నచ్చేవే అతను ఆర్డరు చెయ్యడం, అతనికి నచ్చేవే ఆమె ఆర్డర్ చెయ్యడం, 'అమరప్రేమికులు'గా వుండవలసిన వాళ్ళు అనవసరంగా భార్యాభర్తలై పోయారు' అనుకునేవారు నవ్వుతూ! ఎవరు ఎప్పుడు ఎక్కడ మాట్లాడవలసొచ్చినా అనురాగ దాంపత్యాన్ని గురించి ఈ 'లవ్ బర్డ్స్' గురించే చెప్పేవారు ఉదాహరణగా!

గుర్నాధం మరదలుకి పెళ్ళి కుదిరింది. గుర్నాధానికి సెలవు లేకపోవడంవల్ల, ముహూర్తం సమయానికొస్తానన్నాడు. భార్యామణిని బాగుండదు కాబట్టి, ముందు వెళ్ళమన్నాడు. ఆవిడ అలా ససేమిరా వెళ్ళనంది. అతికష్టం మీద కాళేశ్వర్రావ్వూ, రాందాసు కలిసి ఇద్దర్నీ ఒప్పించి ఎలాగో ఆవిడని నాలుగురోజులు ముందే పంపించారు పెళ్ళికి! అలా బావగారిని వొదిలిపెట్టి తన అక్కగారు నాలుగు రోజులు ముందే ఒస్తుందని ఊహించని పెళ్ళి కూతురు ఎగిరి గంతేసింది, గుర్రం కన్నా వేగంగా.

ఒక రోజంతా ఆ అక్కచెల్లెళ్ళు ఎడతెరిపి లేకుండా మాట్లాడుకున్నారు! రెండోరోజు నుంచీ అక్కగారు పరధ్యానం వహించడం చూసి, అక్కగారు బావగారి కోసం తపించి, కలవరించి కృంగిపోతున్నారని చెప్పి బాధపడిపోయి, రాందాసు బావని పిలిచి 'బావా! అక్క బావగారికోసం బెంగ పెట్టుకుపోయినట్టుంది. కాస్త కబుర్లు చెప్పి ఉత్సాహపరుద్దూ నీకు పుణ్యం ఉంటుంది' బతిమాలింది పెళ్ళికూతురు.

పెళ్ళిపందిట్లో ఒక మూలగా కూర్చుని, ఒంటరిగా ఆలోచిస్తున్న ఆమెని చూసి రాందాసు జాలిగా 'చూడండీ వొదినగారూ! రెండురోజులకే అలా బెంగపడిపోతే ఎలా? ఎల్లుండీపాటికి గుర్నాధం రానే వస్తాడు. అందాకా కాస్త ఓపిక. . ."

మాట మధ్యలోనే కట్ చేసి 'అదేనయ్యా నా బాధ! నేను ఒక్కరోజు లేకపోతే సరి, మా పక్కింటి శైలజాంది చూశావూ, ఆయనగారి కళ్ళన్నీ దానిమీదే! పైగా అది కూడా అంతే! ఇతను కనిపిస్తే చాలు ఏదో లవ్వర్ని చూసినట్టు ముసిముసి నవ్వులు నవ్వుతూ 'ఏమండీ! ఇవాల్టి పేపరొకసారిస్తారా?' అనో, 'మీ ఆఫీసులో ఏవైనా ఖాళీలున్నాయా? నా ఫ్రెండొకమ్మాయుంది' అనో కలిపించుకొని కలిపించుకొని మాట్లాడుతుంది! దాన్ని చూడగానే ఈయనగారి మొహం చింకి చాటంతవుతుంది. అందుకే అతణ్ణి ఒక్కణ్ణే ఒక్కక్షణం వదలిపెట్టను! వెంట వెంట తిరుగుతూనే వుంటాను' బాధగా చెప్పింది. రాందాసుకు మతిపోయి జుట్టు పీక్కున్నాడు!

'పందిట్లో పెళ్ళవుతూన్నదీ' మేళతాళాలతో ఆ పాట మారుమోగిపోతోంది! 'సీతమ్మ పెళ్ళికూతురాయెనె ఆనందమానంద మాయెనే' సన్నాయిమేళం చెవులో రింగుమంటోంది! పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ తలంబ్రాలు పోసుకుంటున్నారు పోటీలుపడి.

అందరూ సరదాగా చూస్తున్నారు పెళ్ళి తతంగాన్ని! గుర్నాధం పెళ్ళాంకోసం వెతుకుతున్నాడు కంగారుగా 'ఏరా ఇప్పుడేం కావాలి! ఎందుకంత అర్జెంటూ?' అడిగాడు కాళేశ్వర్రావు. 'నీకు తెలీదురా! దానికి చాలామంది బావలున్నారు! అందరూ రసికులే! ఎవరి దగ్గరో కూర్చుని . . .' మరి చెప్పలేకపోయాడు గుర్నాధం ఏడ్పువచ్చినంత పనయి.

కాళేశ్వర్రావుకి మతిపోయింది ఆ మాటలు వింటూంటే! జుట్టు పీక్కున్నాడు! తన కళ్ళనీ! చెవులనీ, నమ్మలేక! బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూసిన కాళేశ్వర్రావుకి పక్కనే వుండి చిరునవ్వు నవ్వుతూన్న రాందాసు కనిపించాడు! కాళేశ్వర్రావు ఏదో చెప్పాలని దగ్గరికెళ్ళాడు. రాందాసు నవ్వుతూ 'లవ్ బర్డ్స్ సీక్రెట్! అంతేనా?' అన్నాడు.

'అవును! నీకెలా తెలుసూ!' అన్నట్టు చూశాడు కాళేశ్వర్రావు.

'మొన్న ఆవిడ తన అనుమానాలన్నీ వెళ్ళబుచ్చింది పాపం!'

'నెవర్ . . . బి . . . లవ్ బర్డ్స్' నవ్వుతూ చెప్పాడు రాందాసు! బాబా! ఛడామడా తిట్టుకోవడం, మళ్ళీ కలుసుకోవడం, నవ్వుతూ బతకడంలోనే వుంది జీవితం! వాళ్ళని చూసి ప్రేమపక్షులనుకున్నాం! ఔరా! నోరు తెరిచారిద్దరూ! పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురిపైనా పడవలసిన అక్షింతలు వాళ్ళ నోళ్ళలో పడేసరికి, ఈ లోకంలో పడ్డారు, కాళేశ్వర్రావూ, రాందాసూ, 'ఓరీ గుర్నాధం' ఇదా మీ ప్రేమకథ?' అనుకుంటూ! పందిట్లో అందర్నీ ఒదిలేసి ఒక మూలగా కూర్చున్నారు గుర్నాధం, భార్యామణి! 'ప్రేమపక్షులు' నవ్వుకున్నారు జనం!

*